క్లుప్తంగా

పది పరీక్షలకు ఇద్దరు గైర్హాజరు

రాజవొమ్మంగి: మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో గురువారం జరిగిన పది పరీక్షలకు ఇరువురు గైర్హాజరు అయినట్టు ఎంఈఓ తాత బ్బాయిదొర తెలిపారు. మొత్తం 484 మంది విద్యార్థులకు హాజరుకావాల్సి ఉండగా 482 మంది మాత్రమే పరీక్షలు రాశారన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 156 మందికి గాను ఒకరు హాజరుకాలేదన్నారు. జడ్డంగిలోని గిరిజనసంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో 124 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, ఒకరు గైర్హాజరైనట్టు తెలిపారు.

ఘాట్‌రోడ్డులో ట్రాక్టర్ బోల్తా



బోల్తాపడిన ట్రాక్టర్

గూడెంకొత్తవీధి: పెదవలస ఘాట్‌రోడ్‌లో గురువారం ఉదయం ఇసుక ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ స్వల్పగాయాలతో సురక్షితంగా బయట పడ్డారు. ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్ ఘాట్‌రోడ్డు మలుపు తిరుగుతుండగా అదుపు తప్పి ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

గంగాలమ్మకు ప్రత్యేక పూజలు



ఘటాలతో భక్తుల ఊరేగింపు

అడ్డతీగల: అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రంలో గురువారం గిరిజనుల ఇలవేల్పుగా కొలుచుకునే గంగాలమ్మ జాతర మహోత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఈ మేరకు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో క్షేత్రంలో కొలువైన గంగాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఘటాలతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, ఊరేగింపుగా పురవీధుల మీదుగా సోమాలమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లి, అక్కడ అమ్మవారికి ఘటాలను చూపిన అనంతరం పవనగిరి క్షేత్రానికి తరలివచ్చారు. తీర్థప్రసాదాల స్వీకరణ అనంతరం పుట్టింటి చీర ,సారె, పూజా సామగ్రి పంపిణీ జరిగింది. అనంతరం ఘటాలను వెంట పెట్టుకుని గిరిజన మహిళలు, అర్చకులు వారి వారి స్వస్థలాలకు బయలుదేరి వెళ్లారు.

పేదల చెంతకే వైద్యం

ఫ్యామిలీ డాక్టర్ సేవలు ప్రారంభం



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ జ్యోతి, నేతలు, అధికారులు



అడ్డతీగలలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ వీర్రాజు తదితరులు

ముంచంగిపుట్టు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ సేవలు జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా వైద్యులు గ్రామాల్లో 104 ద్వారా వైద్య శిబిరాలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి, వైద్య సేవలందించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముంచంగిపుట్టు మండలంలో కర్రిముఖిపుట్టు పంచాయతీ కేంద్రంలో డాక్టర్ పి.శిరీష ఆధ్వర్యంలో 58 మందికి వైద్య సేవలందించారు.

అడ్డతీగల: మండల కేంద్రంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను జెడ్పీటీసీ మద్దాల వీర్రాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ప్రజల చెంతకే వైద్య సేవలందడం హర్షణీయమన్నారు. డాక్టర్లు భాస్కర్, నాగ ప్రత్యూష గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు.సర్పంచ్ చిట్టమ్మ, ఎంపీటీసీ ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: తంటికొండలో వైద్యాధికారి లిఖిత ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సర్పంచ్ ఆగూరి శుభలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు అవుగడ్డ నిర్మలదేవి తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: పనసలపాలెంలో చవిటిదిబ్బలు పీహెచ్‌సీ వైద్యాధికారి నరేంద్ర ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తహసీల్దార్ ఎ.తాతారావు గురువారం ప్రారంభించారు. 150 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి దినేష్, సచివాలయ కార్యదర్శి శోభారెడ్డి, మహిళ పోలీసు లోవకుమారి, సిబ్బంది కావ్య, హర్షిత, కుమారి, సౌమ్య, కళావతి తదితరులు పాల్గొన్నారు.



కర్రిముఖిపుట్టులో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ శిరీష



పనసలపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

పార్టీలకతీతంగా సంక్షేమ పాలన

కూనవరం: రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పాలన సాగుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక బరోసా కల్పిస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. చినార్కూరు పంచాయతీ పంద్రాజుల్లి గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ విజయ, సర్పంచ్ అభిరామ్, జెసీఎస్ ఇన్‌చార్జి మరియాదాస్, మేరుకుల రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ పూర్ణానందం, సొసైటీ అధ్యక్షుడు కొండలరావు, నాయకులు గుజ్జాబాబు, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ గడప గడపకు కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సమస్యలు తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. గ్రామస్తులు పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారన్నారు.



గ్రామస్తులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రోడ్డు పనుల పరిశీలన

జి.మాడుగుల: నుర్మతి బిటీ రోడ్డు–గాదిగుంట గ్రామం అసంపూర్తి రోడ్డు నిర్మాణాన్ని గురువారం పీఆర్ ఏఈ మణిక్యం పరిశీలించారు. ఈ రోడ్డులో వెండర్ జీఎస్‌బీ మెటీరియల్ సేకరించి, రాళ్లను పూర్తి స్థాయిలో బ్లాస్టింగ్ చేయకపోవటం, సకాలంలో నిర్మాణ చేపట్టలేదని ఏఈ మాణిక్యం గుర్తించారు. ఈ రోడ్డు స్థితిగతులను, అసంపూర్తి నిర్మాణం గూర్చి సంబంధిత ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ అధికారులకు తెలియజేస్తామన్నారు. గాదిగుంట గ్రామానికి రోడ్డు నిర్మాణ పనులను త్వరలోనే చేపట్టనున్నట్టు పేర్కొన్నారు.

ముంచంగిపుట్టు: సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టులో నిర్మిస్తున్న రోడ్డు పనులను సర్పంచ్ రమేష్, నేతలు పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఏజెన్సీలో అభివృద్ధి జరుగుతుందన్నారు. గిరిజనుల రవాణా కష్టాలు తీరుతున్నట్టు తెలిపారు.



గాదిగుంట రోడ్డును పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ మాణిక్యం

పార్టీ మరింత బలోపేతానికి కృషి



కాపారపు రూతూ

రంపచోడవరం: ఏజెన్సీలో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళ అధ్యక్షురాలు కాపారపు రూతు అన్నారు.పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలుగా తనను నియమించడంపై ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో పార్టీ కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యం పెంచేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి పనిచేస్తామన్నారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ఎంపీపీ బాక ఈశ్వరి అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజనీరింగ్ పనుల్లో అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు నిలిచిపోయాయన్నారు. సర్వసభ్య సమావేశానికి అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని లేనిపక్షంలో చర్యల కోసం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితలో చేర్చడం రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. జెడ్పీటీసీ జానకమ్మ, ఎంపీడీవో నగేష్ వైస్ ఎంపీపీలు ఆనందరావు, లలిత, డీటీ నజీర్, ఐసీడీఎస్ పీవో సీలమ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ బాక ఈశ్వరి

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

గంగవరం: బీజేపీ ఆవిర్భా దినోత్సవాన్నిగంగవరంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ గిరిజన మోర్చా అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి , మహిళా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ ఆధ్వర్యంలో పార్టీ జెండాను గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. భారతి, వెంకటేశ్వర్లుదొర, రమేష్, విశ్వనాథ్‌రెడ్డి, వెంకన్నదొర, శివదొర తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరతిగతిన పూర్తి చేయాలి

జి.మాడుగుల: పాలమామిడి, జి.మాడుగుల–2 గ్రామ సచివాలయాలను ఎంపీడీవో చంద్రశేఖర్ గురువారం సందర్శించారు. రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్స్, గ్రామ సచివాలయ భవనాలు త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లుకు సూచించారు. పాలమామిడిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి, నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.ఇంజినీరింగ్, హౌసింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, మండల ఇంజనీరింగ్ అధికారి మాణిక్యం, హౌసింగ్‌ఇన్స్పెక్టర్ ఈశ్వరరావు తదితరలు పాల్గొన్నారు.



పాలమామిడిలో సచివాలయాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యం

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలోని చెత్త సంపద కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు అన్నారు. గురువారం మండల కేంద్రంకి వచ్చిన ఆయన వేస్ట్ మెనేజ్‌మెంట్ కేంద్రాన్ని, సంత షెడ్లను పరిశీలించారు.తడి చెత్త, పోడి చెత్తపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. చెత్త తరలించే వాహనానికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలన్ని పరిశుభ్రంగా ఉంచడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అందుకు ప్రజలు కుడా సహకరించాలని ఆయన కోరారు. సచివాలయాన్ని సందర్శించారు. సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఎంపీడీవో లాలం సీతయ్య, ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్ ,సర్పంచ్ దురియా పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



చెత్త కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు

జాబ్‌కార్డుదారులకు ఉపాధి పనులు



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో బాపన్నదొర

రాజవొమ్మంగి: మండలంలోని 19 పంచాయతీల్లోని వేతనదారులకు 7 లక్షల పనిదినాలు కల్పించాలని స్థానిక ఉపాధి ప్రోగ్రాం ఆఫీసర్, ఎంపీడీవో కె.బాపన్నదొర సిబ్బందిని కోరారు. ఆయన గురువారం జడ్డంగి శివాలయం ప్రాంగణంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డుదారులందరికీ పనులు కల్పించాలన్నారు. ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా తప్పనిసరిగా మస్తర్లు పంపాలన్నారు. ఏపీఓ సురేష్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

వీఆర్ పురం: రేఖపల్లి వెలుగు కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమంలో కేజీబీవీ విద్యార్థినిలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి వారిని అభినందించారు. అలాగే మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాచర్ల గంగులు ఆయా విద్యార్థినిలకు రూ.1000లను నగదు బహుమతిగా అందచేశారు.



విద్యార్థినులకు నగదు బహుమతి అందిస్తున్న మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాచర్ల గంగులు

జగనన్నే మా భవిష్యత్తు విజయవంతం చేయాలి



జగనన్నే మా భవిష్యత్తు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రత్నకుమారి



హుకుంపేటలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కుమారి, నేతలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చింతపల్లి జెడ్పీటీసీ బాలయ్య, సర్పంచ్ పుష్పలత

పాడేరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నుంచి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా చేపట్టనున్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో కార్యక్రమం పోస్టర్‌ను గురువారం ప్రజాప్రతినిధులు, నాయకులు ఆవిష్కరించారు. పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా చేకూరిన ప్రయోజనాలను తీసుకుని ప్రజల్లోకి వెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పార్టీ శ్రేణులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పాడేరులో ఎంపీపీ సోనారి రత్నకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు , జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ ఎం.సరస్వతి, పార్టీ పంచాయతి రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు, వైస్ ఎంపీపీ కనకలమ్మ, సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీ నర్సింహమూర్తి, నేతలు రమణమూర్తి, కన్నాపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల/అరకులోయ రూరల్/చింతపల్లిరూరల్/గూడెం కొత్తవీధి/కొయ్యూరు/రాజవొమ్మంగి: జి.మాడుగుల, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు, రాజవొమ్మంగి మండల కేంద్రాల్లో గురువారం జరిగిన కార్యక్రమంలో జగనన్న మా భవిష్యత్తు.. 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం పోస్టర్లను వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు ఆవిష్కరించారు. జి.మాడుగులలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు, ఎంపీటీసీ సన్యాసిదొర, సర్పంచ్‌లు గంగరాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు. అరకులోయలో మండల కన్వీనర్ సంపత్‌కుమార్, వైస్ ఎంపీపీ రామన్న తదితరులు పాల్గొన్నారు.చింతపల్లిలో జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచ్ పుష్పలత, ఉపాధ్యక్షుడు నూరుబాబు, కో–ఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ తదితరులు పాల్గొన్నారు. జీకే వీధిలో ఎంపీపీ బోయిన కుమారి, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. కొయ్యూరులో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ నూకరాజు, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, చింతపల్లి ఏఎంసీ చైర్మన్ రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.రాజవొమ్మంగిలో మండల కన్వీనర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. రంపచోడవరం మండలంలోని సచివాలయ కన్వీనర్ పండా రామకృష్ణదొర, ఎంపీపీ బందం శ్రీదేవి, పార్టీ మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, దండంగి సింహాద్రి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సచివాలయ కన్వీనర్లు



జి.మాడుగులలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు



మాట్లాడుతున్న కన్వీనర్ సంపత్‌కుమార్

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

కొయ్యూరు: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశాలు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు గురువారం ప్రకటనలో తెలిపారు. మొత్తం 80 ఖాళీలున్నాయని, ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందన్నారు. తల్లిదండ్రులు వార్షిక ఆదాయం రూ.లక్షలోపు ఉన్న వారు అర్హులని తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రాన్ని విధిగా సమర్పించాలని కోరారు. 6,7,8,9 తరగతుల్లో ఎస్టీలకు బ్యాక్‌లాగ్ పోస్టులు ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 30 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మోతుగూడెం: చింతూరు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమలకు విచ్చేసిన ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి బుధవారం పొల్లూరు గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ అకేటి సీత ఆధ్వర్యంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. లోయర్ , అప్పర్ సీలేరు , డొంకరాయి పరిధిలో 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న 216 మంది కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు.దీనిపై ఎమ్మెల్యే ధనలక్ష్మి సానుకూలంగా స్పందించారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

గ్రామ వలంటీర్ మృతికి సంతాపం

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ చౌటుపల్లి గ్రామ వలంటీర్ సాగిన చిన్నారావు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి సర్పంచ్ ముత్యాలు తదితరులు సంతాపం తెలిపారు.

వారపు సంతల్లో సదుపాయాల కల్పన

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధి, ఆర్వీనగర్ సంతలకు సంబంధించి ఆశీల వేలంపాట గురువారం నిర్వహించారు. వేలంపాటలో ఆశీల వసూళ్ల సొంతం చేసుకున్న నిర్వాహకులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. సంతల్లో మౌలిక సదుపాయాలను కల్పించనున్నట్టు సర్పంచ్, కార్యదర్శులు సుభద్ర, శ్రీనివాస్ తెలిపారు.